క్లుప్తంగా

ఇద్దరు యువకుల దుర్మరణం




రాఘవేంద్ర, అనిల్‌కుమార్ (ఫైల్)

ఆత్మకూరు: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. పోలీసులు తెలిపిన మేరకు.. కర్నూలు జిల్లా పగిడిరాయి గ్రామానికి చెందిన రాఘవేంద్ర (27) సమీప బంధువు అనిల్ కుమార్ (25) అర్చకులు. వీరు ఆత్మకూరులోని సమీప బంధువు అయిన కానిస్టేబుల్ రమేష్‌ను కలిసేందుకు శుక్రవారం ద్విచక్రవాహనంపై వచ్చారు. కానిస్టేబుల్ మొహర్రం సందర్భంగా విధుల్లో బిజీగా ఉండటంతో వారిద్దరూ సాయంత్రం ఏడు గంటల తర్వాత తిరుగుపయనమయ్యారు. వీరి ద్విచక్రవాహనం ఆత్మకూరులోని కళ్యాణదుర్గం రోడ్డుపైకి చేరుకోగానే ఎదురుగా వచ్చిన ఐషర్ వాహనం వేగాన్ని నియంత్రించలేక ఢీకొట్టింది. ప్రమాదంలో రాఘవేంద్ర అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన అనిల్‌కుమార్‌ను 108 వాహనంలో అనంతపురం సర్వజనాస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే ప్రాణం విడిచాడు. కాగా.. అనిల్‌కుమార్‌కు ఏడాది కిందటే పెళ్లయ్యింది. రాఘవేంద్రకు భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బీమా సాయం అందజేత

మద్దికెర: మండల కేంద్రంలో గుజ్జుల రంగన్న అనే వ్యక్తి గురువారం ఉదయం మృతి చెందాడు. మృతుడి పేరిట వైఎస్సార్ బీమా నమోదై ఉండడంతో తక్షణసాయం కింద అతని భార్య సుజాతకు రూ.10 వేలు నగదును జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, ఎంపీపీ అనిత, పంచాయతీ సలహాదారు ఆంజనేయులు, కార్యదర్శి శ్రీహరి శుక్రవారం అందజేశారు. మిగతా సొమ్ము రూ.90 వేలు త్వరలో నామినీ బ్యాంకు ఖాతాలో జమ అవుతుందన్నారు.

వ్యాధుల నివారణకు జాగ్రత్తలు పాటించాలి

మద్దికెర: వరుస వానలతో వర్షపు నీరు నిలిచి దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడే ప్రమాదముందని వ్యాధుల పట్ల జాగ్రత్త వహించాలని ప్రభుత్వ వైద్యాధికారి నగేష్ అన్నారు. శుక్రవారం మద్దికెరలో ఇంటింటికీ తిరిగి సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఎక్కువ కాలం నీటిని నిల్వ ఉంచకుండా చూడాలని అలాగే కుంపట్లలో నీటిని పారవేయాలన్నారు. నీరు ఎక్కువకాలం నిల్వ ఉంటే దోమలు పెరిగి డెంగ్యూ జ్వరాలు వ్యాప్తి చెందుతాయన్నారు. ఎక్కువ రోజులు జ్వరం ఉంటే వెంటనే ప్రభుత్వ వైద్యశాలలో రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాష , ఆశా కార్యకర్తలు ఉన్నారు.

6320 మందికి పీఎం కిసాన్ సాయం

మద్దికెర: మండలంలో 6,320 రైతులకు 14వ విడత పీఎం కిసాన్ సాయం మంజూరైనట్లు ఏఓ రవికుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఆర్బీకేలో పీఎం కిసాన్ పథకంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతులకు ముందస్తు సాయం అందించే ప్రక్రియలో భాగంగా పీఎం కిసాన్ పథకం అమలు చేస్తోందన్నారు. అర్హులైన రైతులకు సాయం అందకపోతే బ్యాంక్ ఖాతాకు ఎన్‌పీసీఐ లింక్ చేయించుకోవాలని సూచించారు. వీఏఏ జాకీర్, ఆనంద్ తదితరులు ఉన్నారు.

స్వచ్ఛమైన నీటిని తాగాలి

ఎమ్మిగనూరురూరల్: గ్రామాల్లో ప్రజలు స్వచ్ఛమైన నీటి తాగేలా చర్యలు తీసుకోవాలని జలజీవన్ మిషన్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బీఎల్ లక్ష్మీనారాయణ సూచించారు. శుక్రవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో జలజీవన్ మిషన్‌పై అంగన్వాడీ టీచర్లకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం, నీటి నాణ్యత కమిటీలో అంగన్వాడీ కార్యకర్తల పాత్ర ముఖ్యమైందన్నారు. స్వచ్ఛమైన నీటిని తాగకపోతే కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సీడీపీఓ సఫరున్నిసా బేగం, సూపర్‌వైజర్ ప్రీతి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్‌పై అవగాహన

గోనెగండ్ల: సురక్షిత తాగునీరు, పారిశుద్ధ్యంపై అంగన్‌వాడీ వర్కర్లు దృష్టి పెట్టాలని జలజీవన్ మిషన్ జిల్లా ఐఈసీ కో–ఆర్డినేటర్ బి.లక్ష్మినారాయణ, సీడీపీఓ మద్దమ్మ సూచించారు. శుక్రవారం మండలంలోని కున్నూరు గ్రామంలో అంగన్‌వాడీ వర్కర్లకు జలజీవన్ మిషన్ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ వర్కర్లు జలజీవన్ మిషన్ పథకం లక్ష్యాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. నీటి నాణ్యత, నీటి పరీక్షలు, పారిశుద్ధ్యం, పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రత, నీటి ద్వారా సంక్రమించే వ్యాధులను వారికి వివరించారు. నీటి పరీక్షలు చేయించడంలో భాగస్వాములై ప్రజారోగ్యానికి కృషి చేయాలన్నారు.

బయోగ్యాస్ యూనిట్ ప్రారంభం

దేవనకొండ: మండలంలో ఐపీఎస్ అధికారి ఆకె రవికృష్ణ దత్తత గ్రామైమన కప్పట్రాళ్లలో రైతు చింతమాను శివలింగప్ప ఇంటి వద్ద సేట్రీస్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బయోగ్యాస్ యూనిట్‌ను శుక్రవారం ప్రోగ్రాం మేనేజర్ బి.నారాయణ ప్రారంభించారు. సేట్రీస్ సంస్థ వారు రూ.40 వేలు విలువ గల బయోగ్యాస్ ప్లాంట్‌ను శివలింగప్ప కుటుంబానికి ఉచితంగా మంజూరు చేసింది. ఈ ప్లాంట్ పశువుల పేడ ద్వారా గ్యాస్‌ను ఉత్పత్తి చేస్తుంది. గ్యాస్‌ను వంటకు వినియోగించుకోవచ్చు. అలాగే ప్లాంట్‌లో ఉత్పత్తి అయిన వ్యర్థాలను ఎరువుగా వినియోగించుకోవచ్చని నిర్వాహకులు తెలిపారు.



పత్తికొండలో పీర్లస్వాముల ఊరేగింపు



పత్తికొండ పాతపేటలోని పీర్లచావిడి వద్ద భక్తుల కోలాహలం



కృష్ణగిరిలో పీర్లస్వాములను ఊరేగిస్తున్న దృశ్యం



మద్దికెరలో విచిత్ర వేషధారణలో యువకులు



వెల్దుర్తి పెద్ద మసీదు పీర్లచావిడి వద్ద అన్నదానం చేస్తున్న భాస్కర్ శెట్టి

మత సామరస్యం చాటిన మొహర్రం





ఆస్పరిలో పెద్ద పీర్లను ఊరేగింపుగా తీసుకెళుతున్న భక్తులు,దేవనకొండలో యువకుల విచిత్ర వేషధారణ, హొళగుందలో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

పత్తికొండ రూరల్: దేదీప్యమానంగా విద్యుద్దీపాలంకరణలతో వెలుగొందే పీర్లచావిడిలు, కొలువుదీరిన పీర్లు, అడుగుపెడితే అత్తరు సెంటు సుగంధాల సుమధురాలు, భక్తి పారవశ్యంతో కులమతాలకతీతంగా బారులు తీరే భక్తాదులు, వారికి ముజావర్ల నెమలి పింఛం ఆశీర్వాదాలు, ధగధగ మండే అగ్ని గుండంలో ఎగిసిపడే నిప్పురవ్వలు, రాత్రంతా ఉల్లాసంగా, ఉత్సాహంగా లయబద్ధంగా కదంతొక్కుతూ సావుసేనిలో యువత, పీర్ల స్వాముల అగ్నిగుండ ప్రవేశం, చూసేందుకు ఎగబడిన జనం, పులివేషధారణలతో యువత మొక్కులు, ప్రీతిపాత్రంగా స్వామివారికి కానుకల సమర్పణ, కాలనీల్లోని భక్తుల ఇళ్లకు పీర్లస్వాముల పర్యటనలు, హిందూ ముస్లింలు కలిసికట్టుగా మతసామరస్యానికి ప్రతీకగా మొహర్రం పెద్ద సరిగెత్తు శుక్రవారం వైభవంగా జరిగింది.

గోనెగండ్ల: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో మొహర్రం వేడుకల్లో భాగంగా శుక్రవారం పెద్ద సరిగెత్తు ఘనంగా నిర్వహించారు. కులమతాలకు అతీతంగా మేళతాళాలతో పీర్ల చావిడి వద్దకు ఊరేగింపుగా వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అలాయి గుంతలో నిప్పులపై నడిచి భక్తిని చాటుకున్నారు. పీర్ల దేవుళ్లను పూలదండలు, వెండి ఆభరణాలతో అలంకరించారు. భక్తులు చావిడిల వద్ద చిందులు తొక్కారు. కొందరు విచిత్ర వేషధారణలతో మొక్కులు తీర్చుకున్నారు. నేడు మొహర్రం పండుగ ఘనంగా నిర్వహించనున్నట్లు ముజవర్లు తెలిపారు.

అల్లర్లకు పాల్పడితే చర్యలు

మొహర్రం పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్‌ఐ తిమ్మారెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వేడుకల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని, మత పెద్దలు, గ్రామ పెద్దలకు తెలియజేశారు. సాయంత్రం పీర్ల దేవుళ్ల ఊరేగింపు సమయంలో, దేవుళ్లను ఏటికి పంపే సమయంలో ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మద్దికెర: మండలంలోని మద్దికెర, పెరవలి, ఎం.అగ్రహారం, హంప తదితర గ్రామాలలో మొహర్రం సందర్భంగా పీర్ల చావిళ్లలో శుక్రవారం పెద్ద సరిగెత్తు వైభవంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పీర్ల స్వాములకు చదివింపులు సమర్పించారు. గ్రామాలలో కొందరు వ్యక్తులు విచిత్ర వేషధారణలతో మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి అగ్నిగుండం చుట్టూ తిరుగుతూ సావుశేన్, సద్దుశేన్ అంటూ కేరింతలు కొట్టారు.

కృష్ణగిరి: మండలంలోని అన్ని గ్రామాల్లో పెద్ద సరిగెత్తు వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. పీర్ల స్వాములకు పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. పీర్లను గ్రామ వీధుల గుండా ఊరేగించారు. శనివారం పీర్లను ఏటికి పంపే కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

వెల్దుర్తి: మొహర్రం పీర్ల పండుగ 9వ రోజు పురస్కరించుకుని శుక్రవారం మండల వ్యాప్తంగా ఘనంగా పెద్ద సరిగెత్తు నిర్వహించారు. మండల కేంద్రంతోపాటు కృష్ణాపురం, కలుగొట్ల, వివిధ గ్రామాలలో కొలువైన పీర్లు రాత్రి నుంచి సవారీ మొదలై పురవీధుల గుండా సాగాయి. స్థానిక పెద్ద మసీదు పీర్లచావిడి వద్ద గత మూడేళ్ల ఆనవాయితీగా గోనెసంచుల కొట్రి భాస్కర్ శెట్టి అన్నదానం నిర్వహించారు. పీర్ల సవారీ అనంతరం శనివారం తెల్లవారుజామున చావిడిలకు చేరుకుంటాయని, సాయంత్రం జలధివాసం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

తుగ్గలి: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం పెద్ద సరిగెత్తు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రజలు పీర్లకు చక్కెర చదివింపులు చేసి వెండి గొడుగులు, పాగాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పీర్ల చావిడిల ముందు ఏర్పాటు చేసిన అగ్ని గుండాల్లో మొద్దులు వేసి వెలిగించారు. చిన్నా పెద్ద సావిసేన్ అంటూ తప్పెట్ల మోతలకు అనుగుణంగా లయబద్ధంగా చిందులు వేశారు. విచిత్ర వేషాలతో అలరించారు. అర్ధరాత్రి దాటిన తర్వాత మేళతాళాలు, తప్పెట్లతో వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.

హొళగుంద: మండలంలో మొత్తం 21 గ్రామాల్లో 34 చావిడిలలో పీర్ల కొలువుదీరాయి. ఆయా గ్రామాల్లో కొలువైన పీర్ల దేవుళ్లకు శుక్రవారం రాత్రి భక్తులు చెక్కర తదితర నైవేద్యం సమర్పించి మొక్కులు సమర్పించుకున్నారు. చావిడిల ముందు అగ్నిగుండ వద్ద తప్పెట్లు కొట్టుకుంటూ మొగలాయి ఆడారు. అనంతరం గ్రామ వీధుల్లో పీర్లు ఊరేగాయి.

ఆస్పరి: మండలంలోని ఆస్పరి, శంకరబండ గ్రామాల్లో పీర్లను మేళతాళాలతో ఊరేగింపు చేశారు. ప్రజలకు అడుగడుగునా పీర్లకు బిందెలతో నీళ్లు పోసి పూజించారు. అగ్నిగుండాల వద్ద యువకులు తప్పెట్లు మోతకు చిందులు వేశారు.

దేవనకొండ: మండలంలో మొహర్రం పండగను పురస్కరించుకుని భక్తుల విచిత్ర వేషధారణలు అలరించాయి. మొక్కుబడిలో భాగంగా కొందరు పులి, ఆడ వేషం, దెయ్యం తదితర వేషాలు వేసి చిందులు తొక్కుతూ ముందుకు కదిలారు. ఏటా తమ సంప్రదాయం ప్రకారం వేషాలు వేసి మొక్కులు చెల్లించుకుంటున్నట్లు వారు తెలిపారు.

కన్యకా పరమేశ్వరి దేవికి ప్రత్యేక పూజలు

వెల్దుర్తి: పట్టణంలోని ఆర్యవైశ్య మహిళల ఆధ్వర్యంలో స్థానిక అమ్మవారి శాలలో వెలసిన కన్యకా పరమేశ్వరి అమ్మవారికి 33 రకాల వంటకాలతో ప్రత్యేక రుచుల నైవేద్యం సమర్పించారు. శ్రావణ శుక్రవారం పర్వదినం పురస్కరించుకుని ఆలయ ప్రాంగణాన్ని రంగవల్లులతోను, అమ్మవారి మూలవిరాటును, ఉత్సవ మూర్తిని ప్రత్యేక అలంకరణ గావించి విశేష పూజలు నిర్వహించారు.



వెల్దుర్తి అమ్మవారిశాలలో 33 రకాల వంటకాలతో నైవేద్యం సమర్పించిన ఆర్యవైశ్య మహిళలు

ఆస్పరి: ఆస్పరి సమీపంలోని రామతీర్థంలో వెలసిన గాయత్రీ మాత ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు శాకాంబరీ అలంకరణలో దర్శమివ్వగా భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

మద్దికెర: స్థానిక మద్దమాంబ ఆలయంలో అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఒడిబియ్యం అందజేసి అభిషేకం, కుంకుమార్చనతో పాటు మహా మంగళహారతి, ఆకు పూజలు చేశారు. భక్తులకు రామాంజులు అనే వ్యక్తి అన్నదానం చేశారు.

తనిఖీ పక్కాగా చేపట్టాలి

హాలహర్వి: సామాజిక తనిఖీని పకడ్బందీగా నిర్వహించాలని డీవీఓ సిద్ధలింగమూర్తి, ఎంపీడీఓ ఆంతోనిని ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సామాజిక తనిఖీ కార్యక్రమం నిర్వహించారు. గతేడాది ఏప్రిల్ నుంచి ఈ యేడాది ఏప్రిల్ వరకు ఎంఎన్ఈఆర్‌జీఎస్ కింద జరిగిన అన్ని పనులపై ఆడిట్ జరుగుతోందన్నారు. జరిగిన పనుల వివరాలు, ఖర్చు చేసిన నిధులు, పనుల్లో అవకతవకలపై సమగ్ర నివేదికలు తయారు చేయాలన్నారు. త్వరలోనే బహిరంగ విచారణ ఉంటుందని చెప్పారు. తహసీల్దార్ మల్లికార్జున, క్లస్టర్ ఏపీడీ పక్కీరప్ప, ఏపీఓ శ్రీనివాసులు, ఎంఈఓ శ్రీనివాసరెడ్డి, సోషల్ ఆడిట్ బృందం తదితరులు పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో వెలుగులు



సర్టిఫికెట్లు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

తుగ్గలి: సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెలుగులు నింపుతున్నారని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. శుక్రవారం రాతన, తుగ్గలిలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో కలిసి లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్న గొప్ప నాయకుడు జగనన్న అని కొనియాడారు. నాలుగేళ్ల పాలనలో పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించారని చెప్పారు. అక్కడక్కడా కొందరు అర్హత ఉండి తగిన సర్టిఫికెట్లు లేక పథకాలకు దూరం అవుతున్నారని గ్రహించి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. జగనన్నకు అండగా నిలిస్తే రాష్ట్రాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయడంతో పాటు పేదలకు మరిన్ని సంక్షేమ పథకాలు అందిస్తారన్నారు. ఇదిలాఉండగా మండలంలో ఈనెల 1వ తేదీన ప్రారంభమైన జగనన్న సురక్ష కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించినట్లు తహసీల్దార్ రవి, ఎంపీడీఓ సావిత్రి తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రామచంద్రారెడ్డి, నాగేష్, విజయమోహన్ రెడ్డి, మోహన్ రెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ మల్లికార్జునరెడ్డి, సర్పంచ్‌లు రాచప్ప, రామాంజనేయులు, నాయకులు టీఎండీ హుసేన్, శ్రీదేవి, చాంద్‌బాషా, అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి

ఎమ్మిగనూరురూరల్: ప్రతి విద్యార్థి పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బీఆర్.బసిరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో జరిగిన 34వ క్లస్టర్ లెవల్ స్పోర్ట్స్, గేమ్స్ మీట్ శుక్రవారం సాయంత్రం ముగిసింది. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ చందిరన్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బీఆర్ బసిరెడ్డి, తహసీల్దార్ ఆంజనేయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బసిరెడ్డి మాట్లాడుతూ.. నవోదయ విద్యాలయాలు క్రమశిక్షణ, నాణ్యమైన విద్యకు పెట్టింది పేరన్నారు. క్రీడాపోటీల్లో గెలుపోటములు సహజమని, ఆటల ద్వారా క్రీడాకారుల మధ్య స్నేహం చిగురిస్తుందని చెప్పారు. తహసీల్దార్ ఆంజనేయులు



విద్యార్థినికి బహుమతి ప్రదానం చేస్తున్న బీఆర్ బసిరెడ్డి

మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడల్లో రాణించడం వల్ల ఆత్మస్థైర్యం పెరుగుతుందని చెప్పారు. అనంతరం ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఇన్‌చార్జ్ వైస్ ప్రిన్సిపాల్ బసవరాజు, అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.



గాయపడిన మహిళ రాములమ్మ

మహిళ చేతికి గాయం

వెల్దుర్తి: బస్సు కిటికీలో నుంచి చేయి బయటకు పెట్టగా రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద మహిళ చేయికి గాయమైంది. కృష్ణగిరి మండలానికి చెందిన రాములమ్మ శుక్రవారం కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి కర్నూలు వెళ్లేందుకు వెల్దుర్తి చేరుకుని అక్కడి నుంచి డోన్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో బయలుదేరింది. తన చేయిని కిటికీ బయట పెట్టడంతో రైల్వే అండర్ బ్రిడ్జ్ వద్ద బయటకు వచ్చిన బలమైన ప్లాస్టిక్ చువ్వలు, సిమెంట్ దిమ్మెలు మహిళ మోచేయిని గాయపరిచాయి. గమనించిన బస్సు డ్రైవర్ రామాంజనేయులు బ్రిడ్జ్ అవతల బస్సును ఆపి, గాయపడ్డ రాములమ్మను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తదుపరి మెరుగైన చికిత్సకు కర్నూలుకు తరలించారు. ఆగిన బస్సులోని ప్రయాణీకులను మరో బస్సులో తరలించారు. డోన్ డిపో మేనేజర్ శశిభూషణ్ పోలీస్‌స్టేషన్ చేరుకుని జరిగిన సంఘటనపై వివరాలందించారు.

ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సాహం

కృష్ణగిరి: బోరు, బావుల ద్వారా నీటి వసతి కలిగిన చిన్న, సన్నకారు రైతులను ఉద్యాన పంటల సాగు వైపు మళ్లిస్తామని ఏపీఓ అబ్దుల్‌షకూర్, శ్రీనివాసులు పేర్కొన్నారు. వారు శుక్రవారం పలు గ్రామాల్లో పండ్ల మొక్కలు నాటే పనులను పరిశీలించారు. మండలంలోని ప్రతి పంచాయతీ నుంచి పండ్ల తోటలు సాగయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా చీని, సపోట, దానిమ్మ, మామిడి పంటలు సాగు చేసుకోవచ్చన్నారు.ఉపాధి కూలీలకు సకాలంలో బిల్లులు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నందవరం: అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం పెద్దకడబూరు మండలం జాలవాడి గ్రామంలో వంక నుంచి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను ముగతి గ్రామంలోని సర్కిల్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఇసుక ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి ఎమ్మిగనూరుకు చెందిన డ్రైవర్ ఉప్పర అంజిపై కేసు నమోదు చేశారు. ట్రాక్టర్ సీజ్ చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ పరమేష్ వెల్లడించారు.

దళితులపై దాడులు అరికట్టాలి

నందవరం: మణిపూర్‌లో దళిత క్రిస్టియన్లపై జరుగుతున్న దాడులు అరికట్టాలని ఐఎంబీ సంఘం పాస్టర్లు బండారి ప్రసాద్, ప్రసాద్, యేసేపు చార్లెస్, భోజరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో క్రిస్టియన్స్ ఆధ్వర్యంలో సంఘం పెద్దలు, నాయకులతో కలిసి పాస్టర్లు ధర్నా చేపట్టారు. అనంతరం అక్కడినుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ రఘువీరాకు పాస్టర్లు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మణిపూర్‌లో చర్చిలు, దళిత క్రిస్టియన్స్ జరుగుతున్న దాడులపై కేంద్రం, ఆ రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా శాంతియుత వాతావరణం నెలకొల్పాలని కోరారు. స్థానిక సంఘం సెక్రటరీ పోతప్ప, సంఘం పెద్దలు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్య



మృతుడు గుడిసె రాజు (ఫైల్)

దేవనకొండ: మండలంలోని గుండ్లకొండ గ్రామానికి చెందిన రైతు గుడిసె రాజు (34) అప్పుల బాధ తాళలేక శుక్రవారం ఉదయం 3 గంటల సమయంలో పొలంలో పురుగు మందు సేవించాడు. గమనించిన కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా కోలుకోలేక ఉదయం 10 గంటలకు మృతిచెందాడు. మృతుడికి గ్రామంలో ఎకరం పొలం ఉంది. మరో ఐదెకరాల పొలం కౌలుకు తీసుకుని సాగుచేస్తున్నాడు. వర్షాభావ పరిస్థితుల కారణంగా సరైన దిగుబడులు రాక అప్పులు ఎక్కువ కావడంతో మనస్తాపం చెంది పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు భార్య సువర్ణ పోలీసులకు తెలిపింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ భూపాలుడు తెలిపారు. మృతుడికి కుమారుడు మహేంద్ర, కుమార్తె హేమాంజలి ఉన్నారు.

కుక్కల దాడిలో జింక మృతి



గంగవరం సమీప పొలంలో గాయపడి ఉన్న జింక

నందవరం: మండల పరిధిలోని గంగవరం గ్రామ సమీప పొలాల్లో కుక్కల దాడిలో జింక మృతి చెందింది. శుక్రవారం రైతులు, పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. గంగవరం సమీపంలో జొహరాపురం గ్రామ రైతు బంటుకుంట వీరేష్‌కు చెందిన పొలంలో ఓ జింకను మూడు కుక్కలు తరుముకుంటూ గాయపరిచాయి. అక్కడ పొలంలో పనిచేసుకుంటున్న పూలచింత గ్రామస్తులు బాషా, నరసింహులు గమనించి కుక్కలను దూరంగా తరిమేశారు. జింక కాలి భాగం, కంటిపై రక్త గాయాలై ఉండడంతో ఆటోలో పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మార్గమధ్యలోనే జింక మృతి చెందింది. ఘటనపై ఏఎస్‌ఐ ఆనంద్ ఫారెస్టు అధికారులకు సమాచారం అందించారు. జింక కళేబరాన్ని ఫారెస్టు అధికారులకు అప్పగించారు.

ఓటరు సర్వే పరిశీలన



చెరుకులపాడులో సర్వేను పరిశీలిస్తున్న పత్తికొండ ఈఆర్‌ఓ మోహన్‌దాస్

వెల్దుర్తి: మండల పరిధిలోని చెరుకులపాడు గ్రామంలో శుక్రవారం జరుగుతున్న ఇంటింటి ఓటరు జాబితా సవరణ సర్వేను పత్తికొండ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ మోహన్‌దాస్ పరిశీలించారు. గ్రామంలో ఏఎస్‌ఓ అభిమన్యు, ఆర్‌ఐ మస్తాన్ రెండు బృందాలుగా బీఎల్‌ఓల వెంట సర్వేలో పాల్గొన్నారు. ఆయా సర్వేలను పరిశీలించిన ఈఆర్‌ఓ సర్వేను పారదర్శకంగా చేపట్టాల్సిన పద్ధతులను సూచించారు. జాబితాలో డబుల్ ఎంట్రీలు, చనిపోయిన వారి ఓటు హక్కును నిబంధనల ప్రకారం తొలగింపునకు సిఫారసు చేయాలన్నారు. ఆగస్టు 21 నాటికి ఓటరు జాబితా సవరణ సర్వే పూర్తయ్యేలా ప్రతి బీఎల్‌ఓ బాధ్యత చేపట్టాలని ఆదేశించారు.

మంత్రాలయం ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి తులాభారంతో చక్కెరను సమర్పిస్తున్న దృశ్యం

ఆలూరు: హాలహర్వి మండలం కామినిహాళ్ గ్రామంలో కొలువుదీరిన హజరత్ హిమామ్ హుసేన్, హుసేన్ పీర్ల చావిడిని శుక్రవారం మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సందర్శించారు. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అయన చక్కెరను తులాభారంగా సమర్పించారు. ముస్లిం మతపెద్దలు, గ్రామస్తులు ఎమ్మెల్యేను సన్మానించారు.

వైఎస్సార్‌సీపీతోనే చేనేతలకు అభయం



మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్

ఎమ్మిగనూరుటౌన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేనేతలకు అండగా నిలిచిందని, గత టీడీపీ ప్రభుత్వం వారిని ఏనాడూ పట్టించుకోలేదని మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహ్మద్ స్పష్టం చేశారు. పట్టణంలో అర్హులైన చేనేతలకు నేతన్న నేస్తం కింద ఆర్థిక సాయం అందడం లేదని, వైడబ్ల్యూసీఎస్ మైదానంలో బంకులను తొలగించాలన్న ప్రతిపక్ష కౌన్సిల్ సభ్యుడు దయాసాగర్ వాదనపై ఆయన ఘాటుగా సమాధానం ఇచ్చారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. విపక్ష సభ్యుడు చేసిన ఆరోపణలపై స్పందించిన వైస్ చైర్మన్ మాట్లాడుతూ.. టీడీపీ చేనేతల వ్యతిరేకి అని, వారి పాలనలో చేనేతలకు చేసిందేమీ లేదన్నారు. చతికిలపడ్డ నేతన్నల జీవితాలను బాగు చేసేందుకు సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నేతన్న నేస్తం కింద ఏటా రూ.24 వేలు సాయం అందిస్తున్నారన్నారు. ఎమ్మిగనూరులో 1,436 మందికి నేతన్న నేస్తం సాయం జమ చేసినట్లు వివరించారు. వైడబ్ల్యూసీఎస్ మైదానంలో ఓ వైపు ఏర్పాటుచేసిన బంకుల అద్దె ద్వారా చేనేత సొసైటీకి ఆదాయం వస్తోందని, దాన్ని కూడా రాజకీయం చేస్తూ తొలగించాలనడం ఎంతవరకు సమంజసం అని హితవు పలికారు. టిడ్కో గృహాలను లబ్ధిదారులకు కేటాయించి, ఇళ్ల తాళాలు అందించామని, కాలనీలో మంచినీరు, విద్యుత్ సౌకర్యాలు కల్పిస్తున్నామని, లబ్ధిదారులు ఇళ్లలో చేరేలా సభ్యులు ప్రోత్సహించాలని కమిషనర్ గంగిరెడ్డి సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. అలాగే దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని, ఒకటవ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణం త్వరలోనే చేపడతామన్నారు. పట్టణంలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు అజెండాతో పాటు టేబుల్ అజెండాలోని అంశాలకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. వైస్ చైర్మన్ దివ్యకళ, కో–ఆప్షన్ సభ్యుడు అబ్రార్, మున్సిపల్ డీఈ నీరజ, మేనేజర్ బేబీ, టీపీఓ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కోలుకోలేక వివాహిత మృతి

- అనాథలైన ముగ్గురు పిల్లలు

హాలహర్వి: మండలంలోని సిద్ధాపురం గ్రామానికి చెందిన వివాహిత పార్వతి (32) బళ్లారిలోని ఓపీడీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం రాత్రి 10 గంటలకు మృతిచెందినట్లు కర్ణాటక పోలీసులు తెలిపారు. వివరాలు.. పార్వతికి 14 ఏళ్ల క్రితం గ్రామానికి చెందిన దొడ్డబసప్పతో వివాహమయ్యింది. వారికి ఒక కుమార్తె మల్లేశ్వరి, కుమారులు మోహన్, సురేష్ ఉన్నారు. పెళ్లయిన ఆరేళ్లకు భర్త దొడ్డబసప్ప అనారోగ్యంతో మృతిచెందాడు. అప్పటి నుంచి ఇంటికి పెద్దదిక్కు లేకుండా పోయిందని పార్వతి బాధపడుతుండేది. గ్రామంలోనే కూలీ పనులు చేసుకుంటూ ముగ్గురు పిల్లలను చదివించుకుంటూ జీవనం గడిపేది. అప్పులు ఎక్కువ కావడంతో విరక్తి చెంది సోమవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. బంధువులు బళ్లారిలోని ఓపీడీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం రాత్రి మృతిచెందింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. వారు స్వగ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు పూర్తి చేశారు. గతంలో తండ్రి, ఇప్పుడు తల్లి మృతి చెందడంతో ముగ్గురు పిల్లలు అనాథలయ్యారు.



పార్వతి (ఫైల్)

పోలింగ్ బూత్‌ల పరిశీలన

నందవరం: మండలంలోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ నిత్యానందరాజు పరిశీలించారు. శుక్రవారం నందవరంతో పాటు పూలచింత, నదికైరవాడి, గంగవరం, జొహరాపురం, పెద్దకొత్తిలి, చిన్నకొత్తిలి, సంజీవపురం, నాగలదిన్నె తదితర గ్రామాలోని పోలింగ్ స్టేషన్లను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం, ప్రభుత్వ ఆదేశాల మేరకు పోలింగ్ బూత్‌లలో మౌలిక సదుపాయాలను పర్యవేక్షించామన్నారు. మండలంలో 58 పోలింగ్ కేంద్రాలు ఉండగా 20 కేంద్రాలను పరిశీలించినట్లు చెప్పారు. కేంద్రాలలో విద్యుత్ దీపాలు, ఫ్యాన్లు, టాయిలెట్లు, రోప్స్, ర్యాంప్ వసతులను పరిశీలించారు. అలాగే బీఎల్‌ఓలు ఓటర్ల సవరణ సర్వే పక్కగా పూర్తి చేయాలన్నారు. ఆర్‌ఐ జెర్మియా, ఏఎస్‌ఓ సూర్యప్రకాష్, బీఎల్‌ఓలు భారతి, రాధిక, రమేష్, అజయ్ తదితరులు ఉన్నారు.



పూలచింతలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ నిత్యానందరాజు